# గాయత్రి

– నందుల సుశీలాదేవి

''సార్ పిలుస్తున్నారు'' అటెండర్ చెప్పగానే వ్రాస్తున్న కాగితాలను పక్కకు పెట్టి సీట్లోంచి లేచింది గాయత్రి.

ఆఫీసరు రూంలోకి వెళ్లింది.

అతను కరుగ్గా చూశాడు.

''ఏమిటండీ! ఈ డ్రాఫ్టింగ్? నేను చదవకుండా సంతకం పెట్టేస్తే ఇది తిన్నగా సెక్రటేరియట్‌కి వెళ్లిపోయేది. ఈ రోజు టపాలో ఈ ప్రపోజల్ వెళ్లితీరాలి. కాస్త తొందరగా సరిచేసి వెంటనే పంపండి'' ఫైలు ముందుకు తోశాడు రఘురాం.

గాయత్రి తన సీటులోకి వచ్చి కూర్చుంది.

మనస్సు చివుక్కుమంది.

సాధారణంగా తను మాట పడదు.

ముందున్న కాగితాలు తీసుకుని క్షుణ్ణంగా పరిశీలించింది.

నిజమే!

ఇంత పెద్ద తప్పు తన కళ్లను దాటుకుని ఏ విధంగా జారిపోయింది?

ఈ రోజు ఇంటికి తొందరగా వెళ్లాలనే ఆదుర్దాలో ఇంత పెద్ద తప్పు చేసింది.

మనస్సుని కూడదీసుకుని కాగితాలను ముందుకు లాక్కుంది.

అన్నీ జాగ్రత్తగా సరిచూసి ఫైలుని సక్రమంగా పెట్టి అటెండర్‌ని పిలిచి కాగితాలను ఆఫీసరు గదిలోకి పంపేసరికి లంచ్ టైమ్ దాటిపోయింది.

తెచ్చుకున్న టిఫిన్ బాక్స్ బాగులోనే ఉండిపోయింది.

అటెండర్ వెనక్కి తెచ్చిన ఫైలును చూసి ఆఫీసరు సంతకాన్ని పరిశీలించి టైపుకి పంపేసింది.

ఇదివరకు వున్న బాస్ కొంచెం నడివయస్సువాడు.

ఆడవాళ్లు ఆఫీసుకి కొంచెం ఆలస్యంగా వచ్చినా కొంచెం తొందరగా వెళ్లిపోయినా చూసీ చూడనట్టు పట్టించుకునేవాడుకాదు.

ఇప్పటి ఆఫీసరు యువకుడు. కష్టపడి పని చేస్తాడు. అందరూ అట్లా చేయాలనే భావన కలవాడు. అమ్మాయిల వగలు, వయ్యారాలు కంటే ఆఫీసు ఫైలు అతన్ని ఎక్కువ ఆకర్షిస్తుంది.

టైపు పూర్తయి వచ్చిన కాగితాలను మరోసారి వివరంగా చూసి అటెండర్ చేత ఆఫీసరుకి పంపింది. పావుగంటలో ఆఫీసరు నుండి తిరిగి వచ్చిన కాగితాలను మరోసారి సరిచూసి టపాలో పంపేసింది.

తృప్తిగా అనిపించింది గాయత్రికి.

''సార్ పిలుస్తున్నారు.''

గాయత్రికి ఆకలి వేస్తోంది.

అసహనంగా ఉంది.

మొహంలో ఏ భావం కనబడకుండా ఆఫీసరు గదిలోకి వెళ్లింది.

రఘురాం అడిగాడు.

''ఆ ఫైలు డిస్పాచ్‌కి వెళ్లిందా?''

''పంపేశాను'' అంది గాయత్రి.

''గుడ్! ఈ రోజు కాస్త ఎక్కువసేపు వుండి ఎస్టిమేషన్లు పూర్తి చేసేస్తారా?''

''సారీ సర్! ఈ రోజు ఆఫీసు అవగానే ఇంటికి తిన్నగా వెళ్లిపోవాలి. మా అబ్బాయిని డాక్టర్ దగ్గరకు తీసుకుని వెళ్లాలి.''

రఘురాం ఆశ్చర్యంగా అన్నాడు.

''మీకు అబ్బాయా? మీరు శ్రద్ధగా పని చేస్తూ వుంటే ఏమీ బాధ్యతలు లేనివారనుకున్నాను. మీవారు...''

గాయత్రి నిర్లిప్తంగా అంది.

''నేను విడోని. మావారు మూడేళ్ల క్రిందట యాక్సిడెంట్‌లో పోయారు. వీలయితే రేపు తొందరగా ఆఫీసుకి వచ్చి మీరు చెప్పిన ఎస్టిమేషన్ తయారు చేసేస్తాను.''

రఘురాం కళ్లల్లో మెదిలిన సానుభూతి గాయత్రి దృష్టి దాటిపోలేదు.

''ఆల్‌రైట్ మీరు వెళ్లండి.''

కాగితాలలో తల దూర్చాడు రఘురాం.

గాయత్రి ఆఫీసు నుండి బయటకు వచ్చేసరికి పక్క సెక్షన్‌లో వుండే ప్రకాశం బైకు ఆపి అడిగాడు.

''లిఫ్టు కావాలా గాయత్రిగారూ!''

గాయత్రి తేలిగ్గా నిట్టూర్చింది.

ఈ టైములో నీరసంతో, ఆకలితో బస్సులో వేలాడుతూ వెళ్లడంకంటే ఇంటికి తొందరగా పోవచ్చుననుకుంటూ ప్రకాశం బైకు ఎక్కింది.

గాయత్రిని ఆమె అపార్ట్‌మెంట్ దగ్గర దింపేసి ప్రకాశం వెళ్లిపోయాడు.

ఫ్లాటు తలుపు తీసుకుని వెళ్లేసరికి బాబు మంచంమీద బొమ్మలు పెట్టుకుని ఆడుకుంటున్నాడు.

సీత ఆరేసిన బట్టలు మడత పెడుతోంది.

బాబు వళ్లు ముట్టుకుని చూసింది గాయత్రి.

వేడిగా ఉంది. కానీ చలాకీగానే ఉన్నాడు.

సీత టీ తీసుకుని వచ్చి అంది.

''రాత్రికి ఉండిపోనా అమ్మగారూ! బాబుకి బాగుండలేదుకదా!''

టీ కప్పు అందుకుంటూ సీతవైపు కృతజ్ఞతగా చూసింది గాయత్రి.

''అట్లాగే ఉండిపో సీతా! కుక్కరు పెట్టేస్తావా? నేను బాబుని డాక్టర్ దగ్గరకు తీసుకుని వెళ్లివస్తాను.''

రాత్రి కరిగిపోతోంది.

బాబుకి మందు ఇచ్చి పాలు పట్టింది. సీతకు అన్నం పెట్టి తనూ తినేసింది.

సీత డ్రాయింగ్‌రూమ్‌లో సోఫాలో వద్దికగా ముడుచుకుని పడుకుంది. పగలంతా పని చేసి వుంటుందేమో వెంటనే నిద్రపోయింది సీత.

బెడ్‌రూమ్‌లో బాబు గాఢంగా నిద్రపోతున్నాడు. గాయత్రి బాల్కనీలోకి వెళ్లి కూర్చుంది.

చీకటి రాత్రులు!

నక్షత్రాలు తళతళ మెరుస్తున్నాయి. సాయంత్రం ఆఫీసరు కళ్లల్లో కనిపించిన సానుభూతి కళ్లముందు మెదిలింది.

ఎందుకు తనకు సానుభూతి?

తననీ, బాబునీ పోషించుకోగలిగిన సంపాదన వుంది.

విశ్వం పోయాక వచ్చిన డబ్బుతో ఈ సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్ కొనుక్కుంది. పని పిల్లగా వచ్చి చేరినా సీత కడుపున పుట్టిన పిల్లలా తనకీ, బాబుకీ అన్నీ అమర్చి పెడుతుంది.

వద్దు! వద్దు! తనకి ఎవరి సానుభూతీ వద్దు.

ఇంకొక నాలుగయిదేళ్లు గడిస్తే బాబు కాస్త పెద్దవాడవుతాడు. వాడి పనులు వాడు చేసుకుని వాడి చదువు వాడు చదువుకుంటాడు.

సానుభూతి కోసం అర్రులు జాపిననాడు తనకి అవి లభించనేలేదు. మానసికంగా ఇప్పుడు తాను గట్టిపడిపోయింది. గతించిన క్షణాలు సజీవంగా కళ్లముందు మెదిలాయి.

విశ్వం, తను యూనివర్శిటీ డిబేట్లలో పాల్గొనడం, తమ భావాలు కలబోసుకుంటూ ఉత్సాహంగా రోజులు గడపడం గుర్తుకు వచ్చాయి.

ఇద్దరూ ఉద్యోగాలలో చేరాక కలసి జీవించాలనే తమ నిర్ణయం తమ ఇద్దరి కుటుంబాలలోనూ అగ్నిని రగిల్చింది.

సనాతన భావాలతో, సంప్రదాయాలను కాదనలేని తన తల్లిదండ్రులు తనకి నయానా భయానా నచ్చజెప్పారు.

కానీ తన నిర్ణయం మారలేదు.

మరుక్షణం వంటరిగానే ఇంటి నుండి బయటకు రాక తప్పలేదు.

విపరీతమైన కట్నకానుకలతో తమ కులంలోని కన్యలను కాదని విశ్వం వెలిబుచ్చిన నిర్ణయాన్ని అతని కుటుంబం హర్షించలేదు.

ఫలితంగా అతనూ, తనవాళ్లకి దూరమయ్యాడు.

కొందరు స్నేహితుల సమక్షంలో తమ జీవితాలు ఒకట

య్యాయి.

అంతలోనే మూడేళ్ల స్వప్నం చెదిరిపోయింది. రోడ్డుని దాటుతున్న విశ్వాన్ని వేగంగా వస్తున్న లారీ ఢీకొంది.

ఏడాది బాబుతో తాను ఒంటరిగా మిగిలిపోయింది.

జ్వలిత జ్వాలలా మండుతున్న తన గుండెలమీద కాస్త చల్లని నీరు తమవాళ్లు గానీ, విశ్వం తరపువాళ్లుగానీ చిలకరించనే లేదు.

''పండులాంటి పిల్లవాడిని మానుండి విడదీసి పొట్టన పెట్టుకుంది. మా కడుపు శోకం తగలకపోదు...''

గాయత్రి మనస్సు భగభగ మండిపోయింది.

''శుభమైన ఇంటిలో పుట్టి కులం ఏమిటో అర్థం లేకుండా అంటూ బంధాలు తెంచుకుని పోయింది. మా ఉసురు దానికి తగలక పోతుందా!''

ఆ రోజునే తాను నిర్ణయం తీసుకుంది. బాబుని సక్రమంగా పెంచి పెద్ద చేయాలి.

తన మనస్సు కుదుట పరచుకుని ఉద్యోగం సక్రమంగా చేసి అందరి మన్ననా పొందాలి.



ప్రయివేటుగా రిసెర్చ్‌కి రిజిస్టర్ చేసుకుంది.

బాబు పెంపకం, తన ఉద్యోగం, తన చదువు! ఈ మూడు బాధ్యతలూ ముప్పేటలా తనని అల్లుకుని పోయాయి. కన్నీటికీ, వ్యధలకూ తనలో తావులేదు. ఎవరి సానుభూతీ తనకి వద్దు.

బాబు తెలివిగా, చలాకీగా పెరుగుతున్నాడు.

విశ్వంలేని లోటు కూడా తనని మరీ బాధించడంలేదు. తన ఆలోచనల్లో అతను సజీవంగా తన ముందే నిలిచి ఉన్నాడు.

వంటరిదాన్ననే భావన తనలో లేనేలేదు.

తన మొహంలోని నిబ్బరం, నిశ్చయం కొంతమందికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంటుంది.

ఈవిడకు వచ్చిన కష్టాన్ని ఎంత ధైర్యంగా ఎదుర్కొంటుందో అనుకుంటారు.

తనకి బాబు ఉన్నాడు. విశ్వం స్మృతులు ఉన్నాయి. అవి చాలు ఈ జన్మకి.

గాయత్రి మంచం మీద వచ్చి పడుకుంది.

మరుక్షణం ప్రశాంతంగా నిద్రపోయింది.

★★★

రఘురాం ఎదురుగా నిలబడి అంది గాయత్రి.

''సర్! పిలిచారుట!''

రఘురాం తలెత్తాడు.

''కూర్చోండి గాయత్రీ!''

గాయత్రి కూర్చుంది.

''రేపు ఆదివారం. మిమ్మల్ని మా ఇంటికి ఆహ్వానిస్తున్నాను. మా ఆవిడ తరపునా, నా తరపునా పిలుస్తున్నాను.''

''సందర్భం ఏమిటి సర్!''

''పండగ పేరంటంకాదు. సరళకు మిమ్మల్ని పరిచయం చేసుకోవాలని ఉంది.''

తన పనీ, ఆఫీసూ తప్ప రఘురాం వ్యక్తిగత జీవితం గురించి తనకేమీ తెలియదు.

అపరిచితురాలైన అతని భార్యతో తనకి పరిచయం ఎందుకు?

గాయత్రి మొహంలోని భావాలను చదువుతూ అన్నాడు రఘురాం.

''మీరు హిస్టరీలో డాక్టరేట్ కోసం కృషి చేస్తున్నారట కదా! తనూ ఆ ప్రయత్నంలోనే ఉంది. అందుకనే మిమ్మల్ని కలవాలనుకుంటోంది. మీరు మా ఇంటికి రావడం మీకు వీలుకాకపోతే తనే వచ్చి మిమ్మల్ని కలుసుకుంటుంది.''

గాయత్రి మొహమాటంగా అంది.

''లేదు. లేదు. నేను తప్పకుండా వస్తాను. ఆదివారం సాయంత్రం వస్తాను.''

''భోజనానికి వచ్చేయండి.''

''లేదు సార్. ఆదివారంనాడైనా బాబుతో కలిసి భోజనం చేయాలి!''

''సరే! మీ ఇష్టం. ఇదిగో నా అడ్రస్. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు మీ కోసం ఎదురు చూస్తాము.''

★★★

పొందికగా, కళాత్మకంగా సర్దివున్న ఆ ఇంటిని చూసి సరళ అభిరుచులను లోలోపల మెచ్చుకుంది గాయత్రి.

స్నేహపాత్రురాలైన సరళ గాయత్రికి ఎంతో నచ్చింది.

రఘురాం, సరళతో ఆ సాయంత్రం అనేక విషయాలు సంకోచం లేకుండా మాట్లాడింది గాయత్రి.

పిల్లల చదువులు, పెరుగుతున్న ధరలు, చదువుతున్న సాహిత్యం... సంభాషణ విశ్వభ్రమణం చేసింది. చాలాసేపటికి సరళ అంది.

''సాహసించి ఒక ప్రతిపాదన మీముందు ఉంచుతున్నాను. చాలా జాగ్రత్తగా ఆలోచించుకోండి. చాలా సున్నితమైన విషయం.''

గాయత్రి మొహంలో ఆశ్చర్యం మెరిసింది.

రఘురాం సరళవైపు చూస్తూ అన్నాడు.

''చెప్పు సరళ! ఆ విషయంలో మంచిచెడులు ఆవిడ ఆలోచించుకుంటారు. అంతిమ నిర్ణయం ఆవిడదే కదా!''

సరళ చాలాసేపు మౌనంగా ఉండిపోయింది. తర్వాత నెమ్మదిగా అంది.

''మా బాబయ్యగారి అబ్బాయి రైల్వేలో ఆఫీసరు. భార్య పోయింది. పిల్లలులేరు. అతనికి తనలాగే జీవితంలో గాయపడ్డ యువతితో జీవితం పంచుకోవాలని వుంది. మీరు నెమ్మదిమీద ఆలోచించుకోండి. మీరు ఒప్పుకుంటే అతనిని మీకు పరిచయం చేస్తాము. రఘు మీ గురించి ఎంతో బాగా చెప్తూ వుంటారు. బాబు భవిష్యత్తు గురించి కూడా మీరు బాధ పడనక్కర్లేదు. అతను పిల్లవాడి బాధ్యత కూడా సంతోషంగా స్వీకరిస్తాడు.''

గాయత్రి చాలాసేపు నిశ్శబ్దంగా వుండిపోయింది.

ఒక్క క్షణం ఆమె మొహంలో బాధావీచికలు చెలరేగాయి.

మరుక్షణం పెదవిమీద సన్నగా చిరునవ్వు మెరిసింది. రఘురాం ఆమెవైపు వింతగా చూసాడు.

సరళ సందిగ్ధంగా చూసింది.

గాయత్రి నెమ్మది నెమ్మదిగా మాటలను పేరుస్తూ అంది.

''సరళగారూ! మన సంఘంలో ఓ యువతి అవివాహితగా ఉద్యోగం చేసుకుంటూ స్వతంత్రంగా ఉండాలని అనుకుందనుకోండి. అది కొంత మందికి నచ్చదు. ఆమె ఏదో కోల్పోతుందేమోనని భావిస్తారు. ఆమెపట్ల స్నేహం తోనే, ఆత్మీయతతోనే అనుకోండి. ఆమెకు పెళ్లి సంబంధాలు వెతుకుతారు. ఆ యువతికి ఏ బాధా లేకపోయినా ఆవిడ గురించి స్నేహితులు బంధువులు తాపత్రయపడతారు. స్వతంత్రంగా ఉండాలనే ఆమె భావనని అంగీకరించి ఆమెను వ్యక్తిగా స్వయంప్రకాశంతో ఎదగనీయరు.''

కొంచెం ఆగి మళ్లీ అంది గాయత్రి.

''అదే విధంగా వయస్సులో భర్తని పోగొట్టుకున్న నావంటి వారి విషయం కూడా అంతే! నాకు నేనుగానే బతకాలని వుంది. ఏదో పోగొట్టుకున్నాననే వేదనతో నేను కుమిలిపోవడంలేదు. స్వతంత్రంగా వంటరిగానే జీవితాన్ని సక్రమంగా గడపాలని అనుకుంటున్నాను. స్వయం సహాయంగా జీవితాన్ని మలుచుకోవాలనుకుంటున్నాను. నా వ్యక్తిత్వాన్ని పెరగనీయండి. వంటరిగా వుండే యువతుల మనోధైర్యం పెరగడానికి ఎవరి ఆసరా అవసరంలేదు. ఎవరికి వారే వారి మనస్సులను మధించుకుని ఆ బలాన్ని తెచ్చుకోవాలి.''

ఆ నిశ్శబ్దంలో మరోసారి గాయత్రి కంఠం మంద్రంగా, దృఢంగా పలికింది.

''చూడండి. నా గురించి మీరు తీసుకున్న శ్రద్ధకు నా కృతజ్ఞతలు. జీవితంలో మరో విధంగా నిర్ణయం తీసుకోవాలని అనుకోవడంలేదు. గడిపిన సంసార జీవితం స్వల్పమైనా విశ్వంతో ఆ కాలం చాలా సుఖంగా గడిచింది.''

అతి ప్రయాసతో అంది గాయత్రి.

''బాబుకి తండ్రి లేని లోటు మరొకరివలన తీరదు. వాడూ జీవితంలో తాను కోల్పోయింది పొందలేనని తెలుసుకుని మానసికంగా గట్టిపడాలి. విశ్వం నా మనసులో సజీవంగానే ఉన్నాడు. బాబు పెంపకం నా బాధ్యత. ఉద్యోగం సక్రమంగా చేయడం నా వృత్తి. నా రిసెర్చ్ మనస్సుకి తృప్తినిచ్చే ప్రవృత్తి. వీటన్నింటితోనూ నేను తృప్తిగా హాయిగా ఉన్నాను. నేనేదో కోల్పోయాననీ, వేదనతో మగ్గిపోతున్నాననీ అనుకోకండి. జీవితంలో కొన్ని ఎదురుదెబ్బలు తగులుతాయి. పుటం వేసిన బంగారంలా వ్యక్తిత్వం కష్టాలతోనే పదునెక్కుతుంది. ఇప్పుడు సాఫీగా నడుస్తున్న నా జీవితంలో ఎటువంటి అసంతృప్తీ లేదు. దయచేసి నన్ను అర్థం చేసుకోండి.''

రఘురాం, సరళ నిశ్శబ్దంగా కూర్చుని ఉండిపోయారు.

గాయత్రి బేగ్ తీసుకుని లేచింది.

ఆమె పెదవులమీద చిరునవ్వు తళుక్కుమంది.

''సర్! మరోసారి మీకు నా కృతజ్ఞతలు. నా గురించి ఇంత ఆదుర్దాపడి నా క్షేమాన్ని కాంక్షించే వారున్నారంటే నాకు అది కొండంత ధైర్యాన్ని ఇస్తోంది. సరళగారూ! మీరూ మా ఇంటికి ఓసారి రండి. బాబుని చూస్తే మీరు వదలరు.''

సరళ కూడా నెమ్మదిగా లేచింది.

''గాయత్రిగారూ! అప్పుడప్పుడు వస్తూ వుండండి. మేమిద్దరం ఓ రోజు మీ ఇంటికి వచ్చి బాబుని చూస్తాము.''

రఘురాం అన్నాడు.

''సరళా! గాయత్రిని నేను దింపి వస్తాను. కారు మీ అన్నయ్య తీసుకుని వెళ్లాడనుకుంటాను. అతని స్కూటర్ వుందిగా. అది తీసుకుని వెళతాను. గాయత్రీ! స్కూటరుమీద మిమ్మల్ని దింపుతాను.''

''చాలా థాంక్స్ సర్. ఈ టైమ్‌లో బస్సులు చాలా రద్దీగా ఉంటాయి. స్కూటరుమీద పది నిముషాల్లో మా ఇల్లు చేరవచ్చును.''

బేకసీట్ మీద గాయత్రి కూర్చోగానే స్టార్టు చేశాడు రఘురాం.

కనుమరుగవుతున్న గాయత్రిని చూస్తూ నిలబడిపోయింది సరళ.

ఆ చూపులోని ఆరాధన గాయత్రి కనబడినంతమేరా కాంతి కిరణంలా ప్రసరించింది.

★

## కాలక్షేపం సంపాదన!



రాజ్‌కపూర్ పెద్ద కొడుకు రణధీర్ కపూర్ కూడా హీరోగా ప్రత్నించి అంతగా రాణించలేక పోయాడు. సినీ తార బబితను పెళ్లి చేసుకున్న రణధీర్ ఆ తర్వాత తమ సొంత బానర్ ఆర్.కె. ప్రొడక్షన్స్ వ్యవహారాలు చూడ్డానికే పరిమితమైపోయాడు. ప్రస్తుతం ఎలాంటి యాక్టివిటీ లేకుండా ఖాళీగా వున్న రణధీర్ ఇంట్లో కూర్చునే బోల్డు సంపాదిస్తున్నాట్ట. ఎలాగంటారా? ఎంచక్కా మందు గ్లాసు పుచ్చుకుని ఆరారా సిప్ చేస్తూ టీవీ ఆన్ చేస్తాట్ట. వివిధ చానెళ్లలో వచ్చే హిందీ సినిమాలు, సినిమా పాటలు చూడ్డం, వాటిలో తమ ఆర్కే సంస్థ చిత్రాలు ఏమున్నాయో ఓ పుస్తకంలో నోట్ చేస్కోవడం ఆనక ఆయా సినిమా హక్కుల్ని సంబంధిత చానెళ్లవారు కొన్నారా లేదా ఎంక్వయిరీ చేయించి కొనకుండా ప్రసారం చేసినట్టయితే వాళ్ల మీద కేసు వేయడం...అలా బోల్డు కాంపెన్సేషన్లు కొట్టేస్తున్నాట్ట. అయినా ఓ వైపు కూతురు కరిష్మా లక్షల్లక్షలు సంపాదిస్తోంటే ఇదేం ఆశ అతనికి? అని చెవులు కొరుక్కుంటున్నారు బాలీవుడ్ జనాలు.

-జె.ఎం.